నేడు దుబ్బ రాజన్న ఆలయంలో టెండర్లు

సారంగాపూర్, జనవరి 7: పెంబట్ల శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం టెండర్లు పిలుస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి అనూష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు ఆలయ ఆవరణలో కొబ్బరి కాయలు, బెల్లం, పూజా సామగ్రి విక్రయాల హక్కు, పూలు, పూల దండలు, పండ్లు, ఆటబొమ్మలు, గాజులు అమ్ముకునే హక్కుల కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం పాట దక్కించుకున్న వారు సంవత్సరం పాటు దుకాణాలు నిర్వహించుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని తెలిపారు.

9 నుంచి ఉత్సవాల ఏర్పాట్లకు టెండర్లు

సారంగాపూర్, జనవరి 7: బీర్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో జాతర టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించే జాతర బ్రహ్మోత్సవాల్లో కొబ్బరికాయలు, బెల్లం, పూజా సామగ్రి, లడ్డు పులిహోర, గండ దీపం, పట్టె నామాలు, కోరమీసాలు, కొబ్బరి ముక్కలు పొగుచేసుకునే హక్కు, తలనీలాలు, వివిధ దుకాణాలు నిర్వహించుకునేందుకు ఆలయ ఆవరణలో 19న బహిరంగ టెండర్లు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే ఉత్సవ ఏర్పాట్లు చేసేందుకు సీల్డ్ కోటేషన్లు ఈనెల 9 నుంచి 18వ తేదీ వరకు ఆలయంలో దరఖాస్తులు స్వీకరించి షెడ్యూల్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు టెండర్లలో పాల్గొనాలని కోరారు.

పద్మశాలీ సంఘు కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి రూరల్, జనవరి 7: ఆత్మనగర్ పద్మశాలీ సుధారక సంఘు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం సంఘు సభ్యులు సమావేశమై అధ్యక్షుడిగా చిలివేరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా గుజ్జేటి వెంకటి, కోశాధికారిగా బాస ధనుంజయ్, కార్యదర్శిగా అన్నందాసుల వివేక్‌ను ఎన్నుకున్నారు.



ఫలితాల మెరుగుకు విద్యా శాఖ చర్యలు

- సిలబస్‌ను ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసింది.
- దసరా పండుగ సెలవుల తర్వాత నుంచి ప్రతి రోజూ ఉదయం లేదా సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. వీటి కోసం హెచ్‌ఎంలు ప్రత్యేక కార్యాచరణ, కాలమానిని నిర్దేశించారు.
- సిలబస్ పూర్తి అయిన తర్వాత ఈ నెల 1 నుంచి మరో యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నారు.
- ప్రతి పాఠశాలలో విద్యార్థులను మూడు కేటగిరీలుగా ఉపాధ్యాయులు అంతర్గతంగా విభజించారు. ఇందులో ఏ కేటగిరీలో ఉన్న విద్యార్థులందరూ ఎబోవ్ ఆవరేజ్‌కు చెందిన వారై ఉంటారు. బీ కేటగిరీలో సాధారణ, సీలో టీచర్ సపోర్ట్ అవసరం ఉన్న విద్యార్థులుగా అంతర్గతంగా విభజించుకున్నారు.
- ఈ నెల 1 నుంచి పాఠశాలల కాలమానినికి అదనంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.
- హెచ్‌ఎంలు పది పరీక్షల వరకు ఉదయం, సాయంత్రం తరగతులకు సంబంధించిన టైమ్‌టేబుల్‌ను రూపొందించి, ఆయా సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులకు టైమ్‌టేబుల్‌ను కేటాయించారు. ఆ మేరకు పిల్లల అధ్యయనానికి సహకరించాలని ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చారు.
- కఠినమైన గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్‌లపై ప్రత్యేక దృష్టిని సారించడంతో పాటు, విద్యార్థులకు ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానాలను రూపొందించి, వారిని సిద్ధం చేశారు. దీని కోసం సంబంధిత సబ్జెక్టులకు కరదీపికలను రూపొందించారు.

పది ఫలితాలపై దృష్టి

- జగిత్యాల జిల్లాలో లక్ష్య పేరిట ప్రత్యేక కార్యాచరణ
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు
- విద్యార్థులను మూడు కేటగిరీలుగా విభజించి అభ్యాస ప్రక్రియ
- ఈ నెల చివరికి సెలబస్ పూర్తి చేసేలా ప్రణాళిక
- గతంలో వరుసగా మూడేండ్లు మొదటిస్థానంలో జిల్లా
- గతేడాది 24 స్థానానికి..
- మళ్లీ మెరుగైన స్థానం కోసం విద్యాశాఖ ప్రయత్నం

పదో తరగతి ఫలితాల్లో పూర్వవైభవాన్ని సాధించేందుకు జగిత్యాల జిల్లా ప్రయత్నిస్తోంది. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత 2016-17 నుంచి వరుసగా మూడేండ్ల పాటు 90 శాతానికి పైగా ఫలితాలతో రాష్ట్రంలోనే తొలి స్థానాన్ని కైవసం చేసుకుని సంచలనం సృష్టించింది. అయితే, ఆ తదుపరి జరిగిన పరిణామాలు, కరోనా విజృంభణ, తదితర కారణాల నేపథ్యంలో పదో తరగతి ఫలితాల్లో క్రమంగా జిల్లా తన ప్రాభవాన్ని కోల్పోతూ వచ్చింది. 2022-23 విద్యా సంవత్సరంలో కేవలం 84 శాతం ఫలితాలతో రాష్ట్రంలో 24 స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం పది ఫలితాలను మెరుగు పర్చుకొని, రాష్ట్రంలో జిల్లాను మెరుగైన స్థానంలో నిలిపేందుకు జిల్లా విద్యాశాఖ శ్రమిస్తోంది. – జగిత్యాల, జనవరి 7 (నమస్తే తెలంగాణ)

జగిత్యాల జిల్లా గత విద్యా సంవత్సరంలో 84.05 శాతం ఫలితాలను మాత్రమే సాధించింది. జిల్లా నుంచి మొత్తం 11,095 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ఇందులో 9325 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 13 ప్రభుత్వ, 171 స్థానిక సంస్థల, 13 మోడల్, 14 కస్తూర్బాగాంధీ, 2 తెలంగాణ గురుకుల, 5 తెలంగాణ సంక్షేమ గురుకుల, 5 తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్, 6 తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలతోపాటు, 100 ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

54 పాఠశాలల్లోనే వందశాతం ఫలితాలు

గత విద్యా సంవత్సరంలో 54 పాఠశాలలు మాత్రమే వంద శాతం ఫలితాలు సాధించాయి. ఇందులో 26 స్థానిక సంస్థల యాజమాన్యాల్లోని పాఠశాలలు కాగా, 25 ప్రైవేట్ యాజమాన్యాలకు చెందినవి. కస్తూర్బాగాంధీ, తెలంగాణ గురుకుల పాఠశాల, తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలకు సంబంధించి ఒక్కొ పాఠశాల వంద శాతం ఫలితాలను నమోదు చేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో అంతం ..

గత విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో అంతంత మాత్రంగానే ఫలితాలు నమోదయ్యాయి. 171 స్థానిక సంస్థల పాఠశాలల నుంచి 4,305 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 3,222 మంది(74.84 శాతం), 13 ప్రభుత్వ పాఠశాలల నుంచి 431మంది విద్యార్థులు హాజరు కాగా, 264 మంది (61.25 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 13 మోడల్ స్కూల్స్ నుంచి 1197 మంది హాజరు కాగా 1094 మంది (91.40 శాతం), కేజీబీవీ పాఠశాలల నుంచి 324 మంది బాలికలు హాజరు కాగా 256 మంది(79.01 శాతం), రెండు గురుకులాల నుంచి 144 మంది హాజరు కాగా 139 మంది(96.53 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 5 సంక్షేమ గురుకులాల నుంచి 297 మంది పరీక్ష రాయగా, 145 మంది, 5 మైనార్టీ గురుకులాల నుంచి 251 మంది హాజరు కాగా 232 మంది, 6 బీసీ గురుకులాల నుంచి 409 మందికి 388 మంది ఉత్తీర్ణత సాధించారు. 100 ప్రైవేట్ పాఠశాలల నుంచి 3737 మంది విద్యార్థులకు 3486 మంది(93.46 శాతం) పాసయ్యారు.

ఈ ఏడాది 11,292 మంది విద్యార్థులు

ఈ ఏడాది జిల్లాలో 360 పాఠశాలల నుంచి 11,292 మంది విద్యార్థులు జిల్లా నుంచి పది పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ మేరకు వారు పరీక్షరుసుం చెల్లించారు. ఇందులో 5559 మంది బాలురు, 5,733 మంది బాలికలు ఉన్నారు. 126 ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల నుంచి 3871 మంది, ప్రభుత్వం అధీనంలో ఉన్న వివిధ యాజమాన్యాలకు చెందిన 234 పాఠశాలల నుంచి 7,421 మంది పరీక్షలు రాయనున్నారు.

మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రయత్నిస్తున్నం

పది ఫలితాల్లో గత విద్యా సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలను సాధించి, పూర్వవైభవాన్ని సాధించేందుకు ప్రయత్నిస్తున్నం. వంద శాతం ఫలితాల నమోదు కోసం అన్ని చర్యలూ చేపట్టాం. లక్ష్య కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. దీనికి సంబంధించిన విధి విధానాలను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నం. సిలబస్ దాదాపు అన్ని పాఠశాలల్లో పూర్తి చేశాం. ఈ నెల నుంచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక దృష్టిని సారించాం. పదో తరగతికి బోధన చేస్తున్న ఉపాధ్యాయులు సైతం అంకితభావంతో పని చేస్తున్నరు. వారికి పలుమార్లు సూచనలు, సలహాలు అందజేశాం. గత విద్యాసంవత్సరం కంటే మెరుగైన ఫలితాలను సాధించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నం.

- డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలి: జడ్పీ చైర్‌పర్సన్

దావ వసంతను అభినందిస్తున్న సంఘం నాయకులు

జగిత్యాల, జనవరి 7: మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మున్నూరు కాపు వర్తక, వ్యాపార సంఘం జగిత్యాల వ్యవస్థాపక అధ్యక్షుడు దీటి అంజయ్య పటేల్, ప్రధాన కార్యదర్శి జంగిలి రవి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎల్‌ఆర్ గార్డెన్స్‌లో ఆ సంఘం క్యాలెండర్‌ను కులబాంధవులతో కలిసి దావ వసంత ఆవిష్కరించారు. సెంట్రల్ సెన్సార్ ఫిల్మ్ బోర్డు మెంబర్‌గా నియమితులైన కొక్కు గంగాధర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వొడ్నాల రాజశేఖర్, కల్యాణ మండపం అధ్యక్షులు బండారి రాజ్ కుమార్, గోవిందుల రాజన్న, పుప్పాల అశోక్, జంగిలి మల్లికార్జున్, ఎర్ర నర్సన్న, పిట్ట రాములు, కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, పిట్ట ధర్మరాజు, ముక్క నవీన్, కూతురు శేఖర్, సమిండ్ల శ్రీనివాస్, కే సత్యం పాల్గొన్నారు.

సొంతగూటికి చేరిన ఎంపీటీసీ

కోరుట్ల రూరల్, జనవరి 7: అయిలాపూర్ ఎంపీటీసీ-1 బోడ గంగాధర్ సొంతగూటికి చేరారు. బోడ గంగాధర్‌కు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మేమంతా కలిసి పని చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, సహకార సంఘం అధ్యక్షుడు గడ్డం ఆదిరెడ్డి, నాయకులు చీటి వెంకట్రావ్, పిడుగు సందయ్య, గుగ్గిల్ల సురేశ్‌గౌడ్, నత్తి రాజ్‌కుమార్, బద్దం తుక్కారెడ్డి, రవీందర్‌రెడ్డి, బండి నరేశ్, గంగారెడ్డి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌లో ఉపాధి అవకాశాలు

జగిత్యాల రూరల్, జనవరి 7: ఇజ్రాయెల్ దేశంలో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సత్తమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ టామ్‌కామ్, తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కార్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ఇజ్రాయెల్‌లో ఉద్యోగ నియామకాలను సులభతరం చేయడానికి ప్రత్యేకంగా ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇజ్రాయెల్‌లో భవన నిర్మాణ కార్మికులు షట్టరింగ్ కార్పెంటర్స్, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్ వంటివి పని చేయడానికి డిమాండ్ ఉందని, ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేయడానికి కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత, 3 సంవత్సరాల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. వయసు 21 నుంచి 45 మధ్య ఉండాలన్నారు. ఈనెల 9న జగిత్యాలలోని న్యూబస్టాండ్ దగ్గర శుభమస్తు కన్వెన్షన్ హాల్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

పెగడపల్లి, జనవరి 7: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆదివారం జిల్లా పరిషత్ సీఈవో రఘువరణ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ విష్ణువర్ధన్, ఆర్ఐ అనిల్, మండల జూనియర్ అసిస్టెంట్ మనోహర్, కార్యదర్శులు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు రతన్ ఎంపిక

ప్రణీక్ రతన్

వెల్గటూర్, జనవరి 7: ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన పులి ప్రణీక్ రతన్ 67వ (ఎస్‌జీఎఫ్) సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి మారెపల్లి కృష్ణారెడ్డి తెలిపారు. ప్రణీక్ రతన్ ఇటీవల నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరి ఎంపికపై అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసి రూ.5 వేలు, స్పోర్ట్స్ కిట్ అందజేశారు. ఈనెల 10 నుంచి 15 వరకు రాజస్థాన్‌లో జాతీయ స్థాయి పోటీలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ప్రణీక్‌ను సర్పంచ్ మారం జలేందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఎండీ బషీర్, సీనియర్ క్రీడాకారులు శ్రీనివాసరెడ్డి, బీ కొమురయ్య, పులి కిరణ్ అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు

కోరుట్ల, జనవరి 7: పట్టణంలోని తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం తైక్వాండో కలర్ బెల్ట్ అప్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. టెస్ట్‌లో 60 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు కలర్ బెల్టులు, అర్హత పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ గాందె సంతోష్ మాస్టర్, జిల్లా తైక్వాండో అధ్యక్షుడు కోలా గంగారావు, పట్టణ తైక్వాండో క్లబ్ కోచ్ నావనంది రమేశ్ పాల్గొన్నారు.

పూడూర్‌లో ఎయిడ్స్‌పై కళాజాత

కొడిమ్యాల, జనవరి 7: పూడూర్ గ్రామంలో జన జాగృతి వేదిక ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై కళాజాత ప్రదర్శన ద్వారా ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత బృంద సభ్యులు గడ్డం రమేశ్, గంగాధర్ నాయక్, కూనమల సుమన్, డప్పు స్వామి, జాను, గ్రామస్తుడు పెద్ది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ధర్మపురి, జనవరి 7: ధర్మపురి కాశెట్టివాడ యూత్ ఆధ్వర్యంలో ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, సీనియర్ జర్నలిస్ట్ సంగబట్ల రామకిష్టయ్య ప్రారంభించారు. కాశెట్టి వాడకు చెందిన చెరుకు రాజన్న, వొజ్జల తిరుపతి, శీలం రాజేశ్ (జర్నలిస్ట్), తిర్మందాసు సత్యనారాయణ(అడ్వకేట్) లు వివిధ కారణాలతో మరణించగా వారి స్మారకార్థం కాశెట్టివాడ యూత్ ఆధ్వర్యంలో టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

సైబర్ మోసాలపై అవగాహన

మేడిపల్లి, జనవరి 7: కట్లకుంట గ్రామంలో ఆదివారం పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో సామాజిక రుగ్మతలు, సైబర్ మోసాలు, ట్రాఫిక్ నియమాలు, డ్రగ్స్, ఆధునిక చట్టాలపై కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ నూతిపెల్లి శంకర్, నాయకులు పన్నాల రాజేశ్వర్‌రెడ్డి, మేడిపల్లి ఎస్ఐ శ్యామ్‌రాజ్ పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

జగిత్యాల టౌన్, జనవరి 7: జిల్లా కేంద్రంలోని గీతా విద్యాలయం గ్రౌండ్‌లో పవన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు వాల్లెపు మొగిలి చిన్నారులకు బెల్టులను అందించారు. కార్యక్రమంలో కోచ్ ఆరుముల్ల పవన్, ఇన్‌స్పెక్టర్ పీ ఆకాశ్, కే శివ, డీ జగన్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

ఎమ్మెల్సీ కుమారుడి రిసెప్షన్‌కు హాజరు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 7: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ పెద్ద కొడుకు వివాహ రిసెప్షన్ జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్‌లో ఆదివారం జరిగింది. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ దంపతులు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.

ప్రభుత్వ బడుల్లో ఉత్తమ విద్యనందించాలి

క్యాలెండర్ ఆవిష్కరణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జీవన్ రెడ్డి

జగిత్యాల, జనవరి 7: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఆదివారం పీఆర్టీ టీఎస్ క్యాలెండర్‌ను ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆనంద్‌రావు, అమర్ నాథ్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతులను మెరుగుపర్చాలని ఈ సందర్భంగా అధ్యాపకులు జీవన్ రెడ్డికి విన్నవించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అధ్యాపకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు కే తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి అత్తినేని శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్ జైపాల్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల శ్రీనివాస్, కేశవేణి శ్రీనివాస్, కార్యదర్శులు విరమేశ్, బీ భాస్కర్, ఏ సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు బీ శ్రీహరి, ఎం సుమన్, మహిళా కార్యదర్శులు వీ సంధ్య, ఎం శ్రీలత, సమీనా కౌసర్ అధ్యాపకులు సీహెచ్ గంగాధర్, సీహెచ్ సునీత, శ్రీధర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

వధూవరులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే దంపతులు

జగిత్యాల రూరల్, జనవరి 7: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) వాల్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజాం కాలం నుంచి నేటి వరకు 77 సంవత్సరాలుగా ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక సంఘం ఎస్టీయూ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జిల్లా నాయకులు కచ్చు రాజన్న, ప్రవీణ్, శివరామకృష్ణ, రాజేశ్, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలి

జగిత్యాల టౌన్, జనవరి 7: వచ్చే పార్లమెంట్ ఎన్నికలలోగా కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 29, 30 తేదీల్లో చలో ఢిల్లీ ఆందోళన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బీసీ సంక్షేమ సంఘం జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపురం రాంచందర్, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల్ల సంజయ్, సామ్రాట్, జాజాల రమేశ్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మల్లన్న జాతరలో విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, జనవరి 7: కాచారం గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. బోనం ఎత్తుకొని స్వామి వారికి నైవేద్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, సర్పంచ్ చిట్యాల సురేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి, నాయకులు గంట శంకర్, పుప్పాల కొమురయ్య, సాయిని గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు

గొల్లపల్లి, జనవరి 7: మల్లన్నపేట దొంగమల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. షష్ఠి ఏడు వారాల జాతర ఉత్సవాల్లో ఆరో వారమైన ఆదివారం స్వామివారిని సుమారుగా 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శనానికి సుమారుగా 3 గంటల సమయం పట్టింది. బారికేడ్లల్లో భక్తుల తోపులాట కనిపించింది. భక్తులు బోనం సమర్పించారు. ప్రత్యేక దర్శనం, పట్నాలు, గండదీపం టికెట్లు విక్రయం ద్వారా రూ.47,720 ఆదాయం వచ్చినట్లు ఆలయం ఫౌండర్ ట్రస్ట్ కొండూరి శాంతయ్య, ఆలయ ఈవో విక్రమ్ తెలిపారు.

ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

మల్లాపూర్, జనవరి 7: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని డీఆర్డీవో నరేశ్ అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలవ్యాప్తంగా అభయహస్తం పథకంలో భాగంగా ఆరు గ్యారంటీల పథకాల కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏమైనా సాంకేతిక పరమైన సమస్యలుంటే తమ దృష్టి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఇక్కడ ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వారంలోగా అర్జీలను ఆన్‌లైన్ చేయాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా
- ఎస్‌కేఎన్ఆర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ పరిశీలన

వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 7: ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తుల డాటా ఎంట్రీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన జిల్లా మానిటరింగ్ సెల్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌కేఎన్ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డాటా ఎంట్రీ కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం సందర్శించి దరఖాస్తుల డాటా ఎంట్రీ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతీ దరఖాస్తు డాటా ఎంట్రీ సూక్ష్మంగా తప్పులు లేకుండా అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో 383 గ్రామ పంచాయతీలు, ఐదు మున్సిలిటీల్లో 134 వార్డులో కలిపి 3,24,532 అభయ హస్తం దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తు లన్నింటింటికీ సంబంధించిన వివరాలను నమోదు చేయాలన్నారు. డాటా ఎంట్రీ కోసం 542 కంప్యూటర్